142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్లు

# క్రమబద్ధీకరణకు సిఫార్సు !

- తిరుమలలో భక్తులకు విశ్రాంతి కేంద్రాలు
- పాతబడిన కాటేజీలు, విశ్రాంతి భవనాలు తొలగింపు
- వేదపారాయణదారులకు నిరుద్యోగభృతి
- శిలాతోరణం, చక్రతీర్థం ఆధ్యాత్మికంగా అభివృద్ధి
- టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు



తిరుమల, జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడిలో సుదీర్ఘకాలంగా వివిధ విభాగాల్లో అధికారులకు వాహనాల డ్రైవర్లుగా సేవలందిస్తున్న 142మంది కాంట్రాక్ట్ డ్రైవర్లను క్రమబద్ధీకరించేందుకు బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం వారందరీ సర్వీసు, సేవలను పరిగణనలోనికి తీసుకుని క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతికోసం సిఫార్సు చేసింది. తిరుమలలో పాతబడిన అనేక కాటేజీలు, విశ్రాంతి భవనాలు హెచ్‌విడిసిలోని ఆరుబ్లాక్‌లు, బాలాజీవిశ్రాంతి గృహం, ఆంప్రోవిశ్రాంతి గృహం, అన్నపూర్ణక్యాం టీన్, కల్యాణిసత్రాలను తొలగించాలని నిర్ణయించారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి తగ్గట్లు గదులు చాలకపోతుండటంతో లాంజ్‌ల్లాగా విశ్రాంతి కేంద్రాలను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించాలని ఆమోదించారు. మంగళవారం అన్నమయ్యభవనంలో టిటిడి పాలకమండలి కీలక సమావేశం జరిగింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో భక్తులకు సౌకర్యాలు, పలు అభివృద్ధి పనులు చేపట్టడంపై కీలకంగా చర్చించారు. బోర్డు తీర్మానాలు,ఆమోదం పొందిన అంశాలను మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ శ్యామలరావు మీడియాప్రతినిధులకు వెల్లడించారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా త్వరలోనే ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్(ఎఐ) అమలుచేసి సామాన్యభక్తులకు త్వరితగతిన దర్శనం కల్పిస్తామన్నారు. తిరుమలలో శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ ,డిపిఆర్ రూపొందించాలని నిర్ణయించారు. వేదపరిరక్షణలో భాగంగా 700మంది వేదపారాయణదారులను నియమించుకునేందుకు, వేద పారాయణదారులకు దేవాదాయశాఖద్వారా 600మందికి నెలకు 3వేల రూపాయలు లెక్కన నిరుద్యోగభృతి చెల్లించేందుకు 2.16కోట్ల రూపాయలు టిటిడి నిధులు మంజూరుచేశారు. రాష్ట్ర హైకోర్టు తీర్పుననుసరించి టిటిడిలో కాంట్రాక్టు డ్రైవర్లుగా పనిచేస్తున్న 142మందిని క్రమబద్ధీ కరించేందుకు టిటిడి బోర్డు ఆమోదిస్తూ ప్రభుత్వ ఆమోదానికి పంపేందుకు నిర్ణయించారు. సమావేశంలో బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాంతారాం. జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి,టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ ,ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,సిపిఆర్ఓడాక్టర్ తలారి రవి,పిఆర్ఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## విలీనాన్ని నిరసిస్తూ తుంబూరు పాఠశాలకు తాళం...!

### లోపలికి వెళ్లకుండా అడ్డంగా ముళ్లకంచె



నారాయణవనం, జూలై 22 ప్రభాతవార్త :

మండలంలోని తుంబూరు పంచాయతీ తుంబూరు దళితవాడలోని ప్రాథమిక పాఠశా లను వేరే పాఠశాలకు ప్రభుత్వం విలీనం చేయడాన్ని నిరసిస్తూ పిల్లల తల్లితండ్రులు మంగళవారం ఉదయం పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. అనంతరం పాఠశాల లోపలికి ఎవ్వరు వెళ్లకుండా ముళ్లకంపను అడ్డంగా వేసి నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా ప్రశాంతంగా సాగుతున్న తుంబూరు ప్రాథమిక పాఠశాలను వేరే పాఠశాలకు విలీనం చేయడం అన్యాయమన్నారు. దీని వల్ల పిల్లలపై ఒత్తిడి పెరుగుతుందని, చదువుకు సైతం దూరమయ్యే సూచనలు లేకపోలేదన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు.

# కన్నుల పండువగా కార్తికేయుని కళ్యాణోత్సవం



శ్రీకాళహస్తి,జూలై 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీవల్లిదేవసేన సమేత కుమారస్వామి వారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కళ్యాణోత్సవం ప్రాంగణాన్ని చక్కగా తీర్చి దిద్దారు.అంతేకాక పెండ్లి మండపం నుంచి కుమారస్వామి తిప్ప వరకు రోడ్డుకు ఇరువైపు మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరించి కళ్యాణ శోభను తీర్చి దిద్దారు. ఆలయంలోని అలంకార మండపం వద్ద వల్లిదేవసేన సమేత కుమారస్వామిని చక్కగా అలంకరించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటి ఇఓ ఎస్ ఆర్ కృష్ణారెడ్డి,ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి హారతులిచ్చి ఉత్సవానికి సాగనంపారు. స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం సందర్భంగా వల్లిదేవ సమేత సుబ్రమణ్యస్వామిని వాహనాల మండపం వద్దకు తెచ్చి అంబారి వాహనంపై ప్రతిష్ఠించారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు,సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ ఆలయ సిబ్బంది, వెంట రాగా గ్రామోత్సవం సాగింది.

**కుమారస్వామి కొండ వద్ద కళ్యాణ వేదికగా . . .**

బోయిలు స్వామి అమ్మవార్లను మోసుకొని స్థానిక భక్తులు హారతులిస్తుండగా వధూవరులుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి విజ్ఞానగిరి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పందిరిలో ప్రతిష్టించారు. సర్వాలంకార భూషితుడైన సుబ్రమణ్యం స్వామిని వరుడుగా, సర్వాంగసుందరంగా అలంకరించారు. వధువుగా శ్రీవల్లీదేవసేనను సుందరంగా అలంకరించి మండపంలోకి చేర్చారు. పంచ భూతాల సాక్షిగా సకల దేవతల సమక్షంలో వేదపండితులు వేద మంత్రాలు చదువుతుండగా స్వామి వారు అమ్మవార్లకు మాంగల్యాల ధారణ చేశారు. ఈవైభవాన్ని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం, సిఎస్ఓ నాగభూషణం యాదవ్,చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఎఇఓ హేమామాలిని,విద్యాసాగర్‌రెడ్డి,దఫేదార్ సుధాకర్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు ఇతర ఆలయాధికారులు హాజరుకాగా శాస్త్రోక్తంగా స్థానిక ఆచారాల మేరకు కళ్యాణోత్సవంను నిర్వహించారు.ఈ ఏడాది ఉత్సవాల్ని ఎలాంటి విమర్శలు,ఆరోపణలు లేకుండా నిర్వహించటంలో సిబ్బంది చొరవను పలువురు ప్రశంసించారు.



అంబారిపై కళ్యాణానికి బయలుదేరిన వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి

# పట్టుబడ్డ ఇంటి దొంగలు

### బోయకొండపై పెద్దభోగం టిక్కెట్లలో చేతివాటం -ఆరుమందిపై వేటు



బోయకొండ(చౌడేపల్లి), జూలై 22 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఇంటి దొంగలు పట్టుబడ్డారు...నెలల తరబడి గుట్టుచప్పుడు కాకుండా టిక్కెట్ల విక్రయాల్లో చేతివాటం ప్రదర్శిస్తూ వేలాది రూపాయలు కొట్టేస్తున్న వైనాన్ని పసిగట్టి పట్టుకొన్నారు...ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిపై వేటు వేసారు...ఉన్నతాధికారులు కథనం మేరకు... శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదాయం పెంచే క్రమంలో కొన్ని సంస్కరణలు తీసుకొచ్చారు. కొండపై భక్తులు అమ్మవారికి సమర్పించే పెద్దభోగం, చిన్నభోగం విషయంలో అమ్మవారికి చెందేలా రూ. 200ల టిక్కెట్టును ఏర్పాటు చేసారు. పెద్దభోగం, చిన్నభోగం చెల్లించే భక్తులు టిక్కెట్టును తీసుకోవాల్సి వుంది. అక్కడ ఆలయానికి చెందిన కొందరు టిక్కెట్టు పుస్తకాలను వారికి తగ్గట్టుగా మలచుకొన్నారు. ఆలయ అధికారులు ఏప్రిల్ నుంచి వందటిక్కెట్లుగల పుస్తకాన్ని అందించి సాయంత్రం సంబంధిత కలెక్షన్‌ను చెల్లించేవారు. ఈక్రమంలో టిక్కెట్టు పుస్తకంలోని ఓ భాగాన్ని భక్తులకందించి తర్వాత మిగిలిన సగంలో ఎవరైతే డ్యూటీలో వుంటారో వారి సంతకంతో కూడినదిగా వుంటుంది. ఇక్కడే ఇంటి దొంగలు తమ చేతికి పనిపెట్టారు. భక్తులకు ఇచ్చే టిక్కెట్టుతో పాటు పుస్తకంలో ఎవరూ గుర్తించరాదని అక్కడక్కడా తక్కిన టిక్కెట్టును ఇచ్చేసి భక్తులనుంచి ప్రతి టిక్కెట్టుకూ రూ. 200లు జేబులోకి వేసుకొన్నారు. ఏప్రిల్ నుంచి దాదాపు 55పుస్తకాలను విక్రయించారు. ఒక్కో పుస్తకానికి 100టిక్కెట్లుంటాయి. ఇప్పటి వరకు ఆయా టిక్కెట్ల నుంచి అక్కడక్కడా రూ. 47,200ల వరకు స్వాహా అయినట్లుగా అధికారులు గుర్తించారు. టిక్కెట్ల వ్యవహారంలో ఉన్నవారందరిపై ఎండోమెంట్ కమీషనర్ ఆదేశాల మేరకు వేటు వేసినట్లు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. వారిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. టిక్కెట్ల వ్యవహారంలో ఎక్కడ ఎలా జరిగిందనే విషయంపై ఆరా తీస్తున్నట్లు వివరించారు. విక్రయాల్లో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగముని, సోమశేఖర్‌రాజు, మునిశేఖర్, గంగరాజు, హరిప్రసాద్, విజయ్‌కుమార్‌రెడ్డిలపై వేటు వేసి విచారణ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఏది ఏమైనప్పటికీ ఆలయంలో అధికారుల పర్యవేక్షణా డొల్లతనం టిక్కెట్ల విషయంలో బయటపడిందని భక్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

మద్యం దుకాణాల్లో

# డిజిటల్ పేమెంట్ ఎందుకు పెట్టలేదు

### మంత్రి అనగాని సత్యప్రసాద్..





రేణిగుంట జూలై 22 ప్రభాతవార్త

గత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లు ఎందుకు పెట్టలేదని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఘాటుగా స్పందించారు. రేణిగుంట పట్టణంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ గత వైసిపి ప్రభుత్వం మద్యం అమ్మకాలపై ఘాటుగా విమర్శించారు. చిన్న బత్తాయి జ్యూస్ అమ్ముకునే బండ్లలో డిజిటల్ పేమెంట్లు పెట్టినప్పుడు లక్షల కోట్ల రూపాయల వ్యాపారం జరిగే మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్ విధానాన్ని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మద్యం షాపులకు వచ్చిన నగదు ఏమైంది అంటూ ప్రశ్నించారు. నాసిరకమైన మందు తయారు చేసి ఎంతోమందిని చావుకు కారకులయ్యారన్నారు.చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు ఎప్పటికీ పాల్పడదని అన్నారు. 30 సంవత్సరాలు వెనక్కు వెళ్లిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత సంవత్సర కాలంలో ఎన్నికల మేనిఫెస్టోలని అంశాలను అమలుపరుస్తూ వస్తున్నారు. ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు పథకం అమల్లోకి రానున్నట్లు తెలిపారు. త్వరలో రైతులను నిరుద్యోగ యువతను ఆదుకుంటామన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యేను మంత్రి పొగడ్తలతో ముంచేత్తారు. కార్యక్రమంలో పలువురు టిడిపి సీనియర్ నాయకులు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిలుక వాహనంపై

# దేవేరితో స్కందుని చిద్విలాసం



శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయం, విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి చిలుక వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని అలంకార మండపంలో వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా రాజేష్ గురుకుల్, సూరిగురుకుల్స్ ముస్తాబు చేసారు. సోమవారం రాత్రి తెప్పోత్సవానికి శూలం అలంకారంలో తీర్చిదిద్దారు. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా అలంకరించారు. ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి హాజరై హారతులివ్వగా ఉత్సవ మూర్తులను బోయిలు మోసుకొని వచ్చి వాహనాల మండపం వద్ద చిలుక వాహనంపై స్వామి అమ్మవార్ల ప్రతిష్ఠించారు. ఆలయాధికారి వెంకటస్వామి,నాగభూషణం యాదవ్,దఫేదార్ రాజా వెంటరాగా ఉత్సవం మేళ తాళాలతో ముందుకు సాగింది. మంగళవారం కావటంతో స్థానిక భక్తులతో పాటు తమిళనాడు,కర్నాటకల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు.ఉత్సవం తేరువీధి, నె హ్రూవీధి, సినిమావీధి, బాబు అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల మీదుగా సాగి ఆలయానికి చేరింది. బిక్షాల గాలిగోపురం వద్ద నాయి బ్రాహ్మణుల సంగీత నీరాజనం అకట్టుకుంది.

## జిల్లా కలెక్టర్‌చే పిహెచ్‌సిల్లో ఆకస్మిక తనిఖీలు



శాంతిపురం, జూలై 22 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం శాంతిపురం మండలంలోని శాంతిపురం, రాళ్లబూదుగూరు పిహెచ్‌సిల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందస్తు సమాచారం లేకుండా జిల్లా కలెక్టర్ ఒక్కసారిగా తనిఖీలకు రావడంతో అధికారులు పరుగులు తీశారు. తొలుత శాంతిపురం పిహెచ్‌సిని తనిఖీ చేసి అక్కడి రికార్డులు పరిశీలించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంకు వెళ్లారు. పలువురు ప్రజలు ఈసందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. అనంతరం సమస్యలపై తహశీల్దార్ శివయ్య, ఎంపిడిఓ పిఆర్‌కుమార్‌తో చర్చించారు. అనంతరం రాళ్లబూదుగూరు పిహెచ్‌సిని తనిఖీ చేశారు. అక్కడ ఉన్న డిజిటల్ నెర్వ్ సెంటర్ పనితీరును పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, మణి, బసవరాజు పాల్గొన్నారు.

## అసాధ్యాలను సుసాధ్యం చేయటం సిఎంకే సాధ్యం

### రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బి.సి సుధాకర్‌రెడ్డి

4లో

## విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా విధులు

### - అర్థ వార్షిక నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, జులై 22 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో విజిబుల్ పోలీసింగ్ పెంచేవిధంగా విధులు నిర్వహించి ప్రజల్లో పోలీసు శాఖకు ఉత్తమ పేరు తీసుకురావడానికి పోలీసు యంత్రాంగం కృషి చేయాలని ఎస్పీ మణికంఠ చందోలు పిలుపు నిచ్చారు. జడ్పీ సమావేశభవనంలో మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా అర్థ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో నేర నిరోధన, దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ఇతర శాఖల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. మెడికో లీగల్ కేసుల్లో వైద్యశాఖ సహకారం, పోస్టుమార్టం నివేదికల విషయంలో నిపుణుల అభిప్రాయాలు, రోడ్డు ప్రమాదాల దర్యాప్తులో ఆర్అండ్‌బి శాఖ సమాచారం, సాంకేతిక నేరాల్లో ఐటి విభాగం మద్దతు అవసరం వుంటుందన్నారు. ప్రజలతో పోలీసుల ప్రవర్తన ఆదర్శనీయంగా వుండాలని, గత ఆరు నెలల్లో పోలీసుశాఖ వివిధ అంశాలపై నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలతో మెరుగైన ఫలితాలు లభించాయన్నారు. సిసిఎన్‌టిఎస్(క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టం) డేటాను క్రమం తప్పకుండా నవీకరిస్తూ వుండాలని ఆదేశించారు. అసాంఘీక కార్యకలాపాలను కట్టడి చేయడానికి డ్రోన్‌ల సహాయంతో నిఘా పెంచాలని, ఇప్పటికీ పోలీసు సిబ్బందికి డ్రోన్ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అర్థ వార్షిక నేర సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, జిల్లా వ్యాప్తంగా వున్న డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# చెల్లింపులే లేదు ... సామాజిక ఆడిట్‌లా?

### డ్వామా పిడిని నిలదీసిన ప్రజాప్రతినిధులు

**2018లో అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించలేదు. తమచేత పనులు చేయించారు. బిల్లుల చెల్లింపులకు సంబంధించి నాయకులు పట్టించుకోలేదు.అధికారులు స్పందించలేదు. ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా పాలనలో పట్టించుకోలేదు. చేసిన పనులకు వడ్డీలు చెల్లించుకోలేక తిప్పలు పడుతున్నాము.ఇప్పుడు మళ్ళీ సామాజిక ఆడిట్ అంటూ అధికారులు వచ్చి వివరాలు కోరటం న్యాయమా? అని మంగళవారం జరిగిన సామాజిక ఆడిట్‌లో ప్రశ్నించారు.**

శ్రీకాళహస్తి రూరల్,జూలై 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలో మంగళవారం సామాజిక ఆడిట్ జరిగింది.ఈ ఆడిట్‌కు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ హాజరయ్యారు. ఉపాధి హామీ పనులపై పంచాయతీల వారీగా సామాజిక ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు ఏడేళ్ళ క్రితం చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. ఎప్పుడు చెల్లిస్తారు? ఎన్నిసార్లు అధికారులకు మొరబెట్టుకున్నాము. కానీ ఎందుకు సమస్య పరిష్కారం కాలేదని నాయకులు డ్వామా పీడిని నిలదీసారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లకు రికవరిలకు ఆదేశించారు. పంచాయతీల వారిగా ఉపాధి హామీ పనులు చోటు చేసుకున్న అవకతవకలను గుర్తించారు. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లు వివరాలు కోరిని సరైన సమాధానాల్లేదు. దాంతో రికవరికి ఆదేశించారు. కొన్నిచోట్ల కొలతలు తేడా ఉంటే కొన్ని చోట్ల లేని వారికి సంబంధించి మస్టర్లు నమోదు చేయటం లాంటి అవకతవకలు జరిగినట్లు రికార్డులు సాక్ష్యం చెబుతున్నాయి. కొన్ని చోట్ల చెట్లు పెంపకంలో తేడాలు ఇతర లోపాలు గుర్తించి అధికమది పిల్డ్ అసిస్టెంట్లకు రికవరీలకు ఆదేశించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు చెంచయ్యనాయుడు,కామేష్‌యాదవ్ సారథ్యంలో ఉపాధి హామీ పనులు చేసి ఏళ్ళు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవటం పై ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్‌ను నిలదీసారు.అధికారులు తమ తప్పిదాలను కప్పి పుచ్చుకొనుటకు ప్రయత్నం చేస్తున్నారని నాయకులు శివమెత్తారు. సోషల్ ఆడిట్



సమావేశానికి కూలీలు ఎవరూ హాజరు కాకపోవటం గమనించదగ్గ విషయం.

**రూ.2.7 లక్షలు రికవరి: ఐదుగురు సస్పెన్షన్:**

సామాజిక ఆడిట్ సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది.అయితే ఎప్పుడో చేసిన పనులకు బిల్లులు చెల్లించక ఆడిట్ చేయటంపై శివమెత్తారు. అధికారికంగా అందిన సమాచారం మేరకు 23 పంచాతీల్లో అవకతవకలకు సంబంధించి రూ.2.73 లక్షలు రికవరి చేసారు. ఈ సంఘటనలకు సంబంధించి సూరావారి పల్లి,మన్నవరం,పుల్లారెడ్డి కండ్రిగలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు మౌనిక,నవీన్,చంద్రమ్మ, అలాగే అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్లు నాగరాజు సోమశేఖర్‌లను విధుల నుంచి తొలగించారు.ఈ కార్యక్రమాల్లో అధికారులు పద్మజ,సరిత, చంద్రశేఖర్‌రాజు, సునీల్ కుమార్,గణేష్‌కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్వరం అగ్రిగోల్డ్ భూముల మ్యుటేషన్

**- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్**

**చిత్తూరు, జులై 22 ప్రభాతవార్త:**
జిల్లాలో అగ్రిగోల్డ్‌కు సంబంధించి ఆస్తులను సత్వరం మ్యుటేషన్ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో మంగళవారం డిఆర్‌ఓ మోహన్‌కుమార్ అగ్రిగోల్డ్ భూములకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మోహన్‌కుమార్ వి.కోట, ఐరాల మండలాల్లో వున్న అగ్రిగోల్డ్ ఆస్తులు, అలాగే చిత్తూరు, పలమనేరు మున్సిపల్ పట్టణాల్లోని అగ్రిగోల్డ్ ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులకు సంబంధించి భౌతిక ధృవీకరణ పూర్తి చేసుకుని రికార్డులు సిద్ధంగా వుంచుకోవాలని, సబ్ రిజిస్ట్రార్ విలువ, మార్కెట్ విలువ గుర్తింపు చేయాలని, అగ్రిగోల్డ్ ఆస్తుల మ్యుటేషన్ సంబంధించిన అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం



వున్న అగ్రిగోల్డ్ భూముల పరిస్థితి ఏమిటి! ఆక్రమణలు, కోర్టు కేసులు, తదితర అంశాలకు సంబంధించి అధికారులు పరిశీలన చేయాలన్నారు. తహసిల్దార్లు గురువారం సాయంత్రంలోపు అగ్రిగోల్డ్‌కు సంబంధించి వ్యవసాయ భూముల మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని, జిల్లా రిజిస్ట్రార్, జిల్లా పౌరసంబంధాల అధికారి, జిల్లా ఐటి ఆఫీసర్, తిరుపతి సిఐడి, ఆర్‌ఓ ఆఫీసర్, చిత్తూరు, పలమనేరు మున్సిపల్ కమీషనర్లు, ఐరాల, వి.కోట తహసిల్దార్లు సభ్యులుగా జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూముల మ్యుటేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రభుత్వ నిబంధనల మేరకు పలు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తిరుపతి డిఎస్పీ రసూల్‌సాహెబ్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ ప్రతినిధి కె.రాంప్రసాద్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి వేలాయుధం, పలమనేరు మున్సిపల్ కమీషనర్ ఎన్‌వి రమణారెడ్డి, చిత్తూరు కమీషనర్ నరసింహప్రసాద్, ఐరాల తహసిల్దారు లోకేశ్వరి, వి.కోట తహసిల్దారు ఉదయసంతోష్, డి సెక్షన్ సూపరిటెండెంట్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**ఎమ్మెల్యే డాక్టర్ థామస్**

**వెదురుకుప్పం, జులై 22 ప్రభాతవార్త :** ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభి



వృద్ధి సాధ్యమవుతుందని గంగాధర నెల్లూరు నియోజ కవర్గం శాసనసభ సభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ వియం.థామస్ పేర్కొన్నారు. మండలంలోని పచ్చికాపల్లంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కరప్రతాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్ దూరదృష్టి కల్గిన నాయకుడు చంద్రనన్న అని ప్రజల అవసరాలు తెలుసుకుని కావలసిన సంక్షేమ కార్యక్రమాలు రూపకల్పన చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అందరికి అందాయని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రజలను పలకరించి కరప్రతాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు లోకనాధ రెడ్డి, మాజీ మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి మునిచంద్రా రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జీ చంగ్రాయ రెడ్డి, నాయకులు రాజశేఖర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

## పోటాపోటీ నడుమ నగర నాయిబ్రాహ్మణ ఎన్నికలు

**– రెండు ప్యానల్స్‌లో మొదటి ప్యానల్ 175 ఓట్ల మెజార్టీతో గెలుపు**

**తిరుపతి కలెక్టరేట్, జులై 22 ప్రభాతవార్త :**
పోటాపోటీ నడుమ స్థానిక యూత్ హాస్టల్‌లో మంగళవారం నగర నాయిబ్రాహ్మణ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్ పోస్టులకు ఎన్నికలు జరిగాయి. ఇందులో మొదటి ప్యానల్‌లో జయకుమార్, దాము, శివ పోటీ చేయగా రెండవ ప్యానల్‌లో ఆవులపాటి రాఘవ, గోవిందస్వామి, శ్రీనివాసులు పోటీ పడ్డారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 530 ఓట్లకు గాను, 370 ఓట్లు పోలైయ్యాయి. మొదటి ప్యానల్‌కు 175 ఓట్లు రాగా, రెండవ ప్యానల్‌కు 140 ఓట్లు వచ్చాయి. 35 ఓట్ల మెజార్టీతో మొదటి ప్యానల్ గెలిచింది. దీంతో మొదటి ప్యానల్ అభ్యర్థులను బలపరిచిన మాజీ నగర అధ్యక్షులు సిబ్యాల సుధాకర్ ఆధ్వర్యంలో గెలుపొందిన మొదటి ప్యానల్ అభ్యర్థులు టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర నాయిబ్రాహ్మణ సోదరులు, సెలూన్ యజమానులు, బార్బర్లు, ఏపీ నాయిబ్రాహ్మణ రాష్ట్ర నేత ఆవుల పాటి బుజ్జిబాబు, ఎలక్షన్ ఆఫీసర్ ద్వారకానాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధుల సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యం




***గంగాధర నెల్లూరు జులై22 ప్రభాత వార్త:*** ప్రజా ప్రతినిధుల సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపిపి అనితా రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అందరు ప్రజాప్రతినిధులు సహరిస్తేనే మండల అభివృద్ధి సాధ్యమని దీనికోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని అన్నారు.అనంతరం సర్పంచ్ సభ్యులు చెరువు కాలువ ఏర్పాట్లు విద్యుత్ లైన్ల మరమ్మత్తులు గుంతల మయమైన గ్రామీణ రోడ్ల ఏర్పాటు లాంటి సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.వెంటనే ఎంపిడిఓ కృష్ణమహేష్ రెడ్డి ఆయా శఖ అధికారులను సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందించి పరిష్కారించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు లక్ష్మీప్రియ దామోదరం, వైస్ ఎంపిపి హరిబాబులతో పాటు పలువురు ఎంపిటిసిలు సర్పంచులు మండల పంచాయతీ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు బాబాలను ప్రోత్సహించవద్దు

**తిరుపతి హెల్త్, జులై 22 ప్రభాతవార్త :**



మతాలకు దగ్గరుగా ఉండే బాబాలను ప్రోత్స హించవద్దని సీఎం నారా చంద్రబాబు నాయుడు హేతువాద సంఘం నేతలు వెంకటసుబ్బయ్య, మోహన్‌రెడ్డి, ఏఆర్‌రెడ్డి, చిన్నపెంచలయ్య హితవు పలికారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడా రు. మతాలను ప్రోత్స హించే రవిశంకర్, బాబాజీ, పుట్టపర్తి సాయిబాబా, స్వరూపనందస్వామిలాంటి స్వామీజీలకు నూతనగా ప్రవేశపెట్టిన జీవో 862 ప్రకారం కూటమి ప్రభుత్వం అండగా ఉండి, వారికి ప్రభుత్వ భూములను కట్టబెట్టాలనుకోవడం దారుణమని, అలాగే పుట్టపర్తి సాయిబాబా జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. దానికి సంబంధించిన జీవో ప్రతువులను చించి చెత్తబుట్టలో వేశారు. ఈ కార్యక్రమంలో హేతువాదులు పాల్గొన్నారు.

## 29న కాణిపాకం ఆలయ హుండీల లెక్కింపు

***కాణిపాకం, జులై 22 ప్రభాతవార్త***
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 29న హుండీల లెక్కింపు నిర్వహించ నున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు జరిగే హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక పాల్గొనాలని తెలిపారు.

## బి.టెక్ సెకండ్ సెమిస్టర్ ఫలితాల్లో కెఇసి విజయభేరి

**కుప్పం,జులై 22 ప్రభాతవార్త**



కుప్పం ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)లో మే,జూన్ నెలల్లో నిర్వహించిన బిటెక్ ఫస్టియర్ సెకండ్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బిసిఎన్ (గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, అనంతపురం జెఎన్‌టియు ఎగ్జామినేషన్స్ పరిశీలకులు డా॥ చిత్ర మంగళవారం విడుదల చేశారు. ఈసందర్భంగా బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ సెకండ్ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈవిజయాన్ని ఇలాగే కొనసాగించాలని సూచించారు. బ్రహ్మణి 94.6శాతంతో ప్రథమస్థానం, కసిరెడ్డి రక్షిత 93.8శాతంతో ద్వితీయ స్థానం, కొట్టే వాగ్దేవి 92.9శాతం మార్కులతో తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగే అత్యధిక శాతం విద్యార్థులు డిస్టింక్షన్, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, హెచ్ఒడి మాధవన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమసుందరం పాల్గొన్నారు.

## వైభవంగా ద్రౌపతి అమ్మవారి కల్యాణం

**రామచంద్రాపురం, జులై 22 ప్రభాతవార్త :**



ఉభయదారులుగా కొట్టే నరసింహారెడ్డి చుట్టుగుంట రామాపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ద్రౌపతి అమ్మవారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉభయదారులుగా మిట్టూరు గ్రామస్తులు రామాపురంకి చెందిన కొట్టే నరసింహారెడ్డి దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం వేద మంత్రాలు నడుమ అమ్మవారి కల్యాణ తంతు నిర్వహించారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు అన్నదానం వితరణ చేశారు.

## ద్రవిడ వర్సిటీలో యుజి సెమిస్టర్ ఫలితాల విడుదల

**కుప్పం, జులై 22 ప్రభాతవార్త**
ద్రవిడ విశ్వవిద్యాలయంలో యుజి రెండు మరియు నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ పరీక్షా ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించి ఫలితాలు తెలుసు కోవచ్చనిరిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య నాగేశ్వరరావు తెలిపారు.

## బీజేపీ జిల్లా కార్యదర్శిగా కాయం హరినాథరెడ్డి నియామకం

**రామచంద్రాపురం, జులై 22 ప్రభాతవార్త :**



బీజేపీ జిల్లా కార్యదర్శిగా రామచంద్రాపురం మండలం నడవలూరు గ్రామానికి చెందిన కాయం హరినాథరెడ్డి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం తిరుపతి జిల్లా పార్టీ పదవుల నియామకాలను విడుదల చేశారు. కాయం హరినాథరెడ్డి 1998 నుంచి పార్టీలో కార్యకర్తగా నాయకుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తిగా మంచి గుర్తింపు ఉంది. పార్టీలో పలు పదవులను అలకరించారు. గతంలోనూ ఉమ్మడి జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ అధిష్టానం ఆయన సేవలను గుర్తించి రెండవ సారి జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తన సేవలను గుర్తించి రెండవ సారి జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌కి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్‌కి, పలువురు సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి జిల్లాలో పార్టీ బలోపేతానికి మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, కార్యకర్తలను నాయకులను కలుపుకుని పార్టీని ముందుకు తీసుకెళతానని తెలిపారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోరు

**కుప్పం, జులై 22 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మం డలంలోని మోట్లచేను పంచాయతీ కొత్తచేను గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారంకు నూతన బోరు డ్రిల్లింగ్ పనులను మంగళ వారం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ పూజ చేసి ప్రారంభించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మండలంలో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేతలు సుబ్రమణి, మోహన్, శివ, ఎతిరాజులు, విభూషణ్, వెంకటేష్, గుణశేఖర్, అనుచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎరుకుల సంఘ ఉపాధ్యక్షుడిగా జగదీష్

**కుప్పంరూరల్, జులై 22 ప్రభాతవార్త**



రాష్ట్ర ఎరుకుల సంఘ ఉపాధ్యక్షుడిగా కుప్పం మున్సిపల్ మొదటి కౌన్సిలర్ జగదీష్ అలియాస్ జగన్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు కు ంభ రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే చిరంజీవి తెలిపారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ ఎరుకుల జాతి అభివృద్ధికోసం, సమస్యల పరిష్కార ంతోపాటు హక్కుల సాధనకోసం తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గోపీనాథ్‌కు సేవారత్న పురస్కారం



**కుప్పం, జులై 22 ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం మాజీ సర్పంచ్ గోపీనాథ్‌కు ప్రతిష్టాత్మక సేవారత్న పురస్కారం లభించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ వారు ఈ అవార్డును ప్రకటించారు. వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టిన గోపీనాథ్ సేవలను గుర్తించి ఈఅవార్డును ప్రకటించారు. ఈసందర్భంగా ఆయనను పలువురు దేశం నేతలు అభినందించారు.



సింగల్ విండో ఛైర్మన్‌గా నియమితులైన చేకూరి జనార్థన్ చౌదరిని సోమవారం పుల్లమనాయుడు కండ్రిగ పంచాయితీ తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, పుష్పగుచ్ఛాన్ని అందించి దుశ్శాల వాళ్ళతో సన్మానించి అభినందించారు.

*రామచంద్రాపురం, ప్రభాతవార్త*

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా మల్ల కుప్పం శేఖర్ నియామకం

**తిరుపతి, జులై 22 ప్రభాతవార్త :**
బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్ల కుప్పం శేఖర్‌ను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌కి, జిల్లా అధ్యక్షులు చామంచి శ్రీనివాసులకి, టీటీడీ బోర్డు మెంబరు భాను ప్రకాష్‌రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి, మాజీ అధ్యక్షుడు చంద్రప్పకి,
కోలా ఆనందకి చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్‌కి, కోర్ కమిటి సభ్యులకు ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శిగా అట్లూరిశ్రీనివాసులు

**చిత్తూరురూరల్, జులై 22 ప్రభాతవార్త:**



భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా అట్లూరిశ్రీనివాసులను రెండవ పర్యాయం తిరిగి ఎన్నుకొన్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అట్లూరి శ్రీనివా సులు మాట్లాడుతూ 1993 లో భాజపా కార్యకర్తగా చేరి పట్టణ యువమోర్చా కార్య దర్శి, జిల్లా కార్యదర్శి, జిల్లా మీడియా ఇన్‌ఛార్జీ, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ సూచించిన విధంగా బాధ్యతలు నిర్వహిస్తున్న తనను తిరిగి రెండవ పర్యాయం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన పార్టీ నాయకులకు, జిల్లా అధ్యక్షులు జగదీశ్వరనాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా నాయకులు, నిరంతరం ప్రోత్స హిస్తున్న ఆత్మీయులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## భాజపా పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి

**– పథాదికారుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు**

***చిత్తూరురూరల్, జులై 22 ప్రభాతవార్త:*** భారతీయ జనతా పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు కోరారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నూతనంగా నియమితులైన పథాదికారులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెలలో నూతన రాష్ట్ర అధ్యక్షులు పర్యటనను విజయవంతం చేసేలా మండల కమిటీలను ఏర్పాటుచేయాలని కోరుతూ పథాదికారులకు నియామక పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు అట్లూరిశ్రీనివాసులు, విజయకుమార్, లోకేష్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, చంద్రమోహన్, రవికుమార్, మణిశర్మ, జిల్లా కార్యదర్శులు ప్రభాకర్, జయచంద్రరెడ్డి, వెంకటరమతణనాయుడు, సత్యభామ, జలజాక్షిలతో పాటు ఇతర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ విచ్ఛిన్నం

**– రాష్ట్ర వైఎస్‌ఆర్‌టిఎ కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ధ్వజం**

**చిత్తూరు, జులై 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో విద్యావ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నం అయ్యిందని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర స్థాయిలో అధికారులు చేపడుతున్న ప్రణాళికలు, విద్యా సంబంధ చర్యలు ప్రాథమిక విద్యను బలహీనపరుస్తున్నాయన్నారు. గ్రౌండ్ లెవెల్‌లో వున్న ఇబ్బందులు, నెట్‌వర్క్ సమస్యలు పట్టించుకోకుండా అధికారుల అత్యుత్సాహం, ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం ఇష్టానుసారంగా ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. త్వరలో ఉపాధ్యాయులు కూటమి సర్కాలు ప్రవేశపెట్టనున్న యాప్‌లు, ఆన్‌లైన్ పనులు, జూమ్ మీటింగ్‌లకు వ్యతిరేకంగా రోడ్డుఎక్కే పరిస్థితులను కన్పిస్తున్నాయన్నారు. పాఠశాలలు ప్రారంభం నుండి కిట్లు పంపిణీ, యూనిఫాం పంపిణీ, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రా, యోగ, మెగా సిటిఎం మరో 18 రకాల కర్మయోగి కోర్సులు, శానిటేషన్ పనులు, శిక్షణలతో ఉపాధ్యాయులు పూర్తిగా బోధనేతర పనులకు అంకితమయ్యారన్నారు. విద్యాశాఖలో పెద్దలు ఎవరికి వారుగా ఒక సమాంతర ప్రభుత్వంను నడుపుతూ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. బోధన సమయంలో విద్యాశాఖ అధికారి జూమ్ మీటింగ్‌ల నిర్వహణ పట్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు అసహనంగా వున్నారన్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం పోయిందని, ఉపాధ్యాయులకు రికార్డులు, రిపోర్టులు బాధ్యతల నుండి విముక్తి కల్పించి పాఠశాల ప్రగతికి, నాణ్యమైన విద్య కోసం కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## మణికంఠేశ్వరాలయంలో ఘనంగా ప్రదోషకాల పూజ

***కాణిపాకం, జులై 22 ప్రభాతవార్త:***



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలంలో మంగళవారం ప్రదోషకాల పూజలను అత్యంత ఘనంగా నిర్వ హించారు. ప్రతి నెలా ఆలయంలో త్రయోదశి రోజున ప్రదోష కాల సమయంలో మణికంఠే శ్వరాలయం లోప్రదోష కాలపూజ లను నిర్వహిస్తు న్నారు. ఈమేరకు సోమవారం సాయం త్రం ఆలయంలో ప్రదోష కాలమందు ఆలయ అర్చకులు వేదపండితులు మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారి మూల విరాట్‌తో పాటు స్వామివారి వాహనం నందికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతర ం అలంకరించి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అధికారులు, అర్చకులు, వేదపండితులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ బసవమల్లేశ్వరస్వామి ఉత్సవం

**– రాతిబండపై భోజనం తిన్న ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల.. భక్తులు !!**

**కుప్పం, జులై 22 ప్రభాతవార్త**



గుడుపల్లె మండలం చిన్నమల్లప్ప కొండపై వెలసిన శ్రీ బసవ మల్లేశ్వరస్వామి ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవం నిర్వహించారు. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఈసందర్భంగా స్వామివారి ఉత్సవాన్ని మోయడంతో పాటు సంప్రదాయ బద్ధంగా రాతి బండపై స్వామివారి సన్నిధిలో భక్తులతో కలసి సహప ంక్తి భోజనం చేశారు. సిఎం చంద్రబాబునాయుడు తరపున మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బాబునాయుడు, కడ సభ్యుడు వెంకటేష్, మాజీ పార్టీ అధ్యక్షుడు హేమాంబర గౌడు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేత

**కుప్పం, జులై 22 ప్రభాతవార్త**
కుప్పం కడ కార్యాలయంలో మంగళవారం కడ, వన్‌ఎంటువన్‌బి సంస్థల అధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన యువతీయువకులకు మంగళవారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక ్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌లు నియామకపత్రాలు అందజేశారు.




యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో వన్‌ఎంవన్‌బి సంస్థ ప్రతినిధి దీపిక వెంకటేష్ పాల్గొన్నారు.

## ముప్ఫై ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**శాంతిపురం, జులై 22 ప్రభాతవార్త**



సుమారు ముప్ఫై ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు మరోసారి కలవాలని నిర్ణయించుకున్నారు. 1995-96 విద్యా సంవత్సరంలో శాంతిపురం హైస్కూల్‌లో పదవ తరగతి చదివిన విద్యార్థులు మంగళ వారం మండలంలోని వరదేపలి వద్దగల శ్రీ ఇరుగులమ్మ ఆలయం వద్ద కలిశారు. ఈసందర్భంగా తమ ముప్ఫై ఏళ్ల జీవితం గురించి తమ బాల్యం నాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈసందర్భంగా తమ బృందం తరపున పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

## పరమహంస విద్యాలయలో పైడే నిర్వహణ

**శాంతిపురం, జులై 22 ప్రభాతవార్త**



స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయలో మంగళవారం పైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పై యొక్క ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, గణిత ఉపాధ్యాయులు దివాకర్, బాలసుబ్రమణ్యం, నిహారిక, సుజాతలు విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు చార్టులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో కర్నాటక మాజీ డిప్యూటీ సీఎం

**కాణిపాకం, జులై 22 ప్రభాతవార్త:**



కర్నాటక రాష్ట్రం మాజీ డిప్యూటీ సీఎం, పద్మనాభనగర్ నియోజవర్గ ఎమ్మెల్యే అశోక మంగళవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయం ముందు స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఆలయ రాజగోపుం వద్ద ఈఓ పెంచల కిషోర్,అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. .వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ ఒడ్డుపల్లె భాస్కర్‌నాయుడు, దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, ఐరాల సింగిల్ విండో అధ్యక్షుడు శేషాద్రి నాయుడు,మోహన్‌నాయుడు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం వస్తే ప్రయాణం కష్టమౌతుంది: వంతెనలిచ్చిఆదుకోండి

## మంత్రికి ఎంఎల్ఏ అభ్యర్ధన

శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం పుణ్యక్షేత్రం. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వాయులింగేశ్వరుడు, గుడిమల్లంలో పరశురామేశ్వరుడు, తొండమనాడులో వెంకటేశ్వరస్వామి, తొట్టంబేడులో అర్ధనారీశ్వరాలయం వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారని అయితే వర్షాకాలం వస్తే శ్రీకాళహస్తి పట్టణానికి గ్రామాలతో సంబంధాలు తెగిపోతున్నాయని పలుచోట్ల లో లెవల్ కాజ్‌వేలు, మరి కొన్ని చోట్ల వంతెనలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి రహదా రులు భవనాల శాఖామాత్యులు బి.సి సుధాకర్‌రెడ్డికి మొరబెట్టుకున్నారు. మంగళవారం శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన ఆయనకు ఆతిధ్యమిచ్చి తన నియోజకవర్గంలోని బాధలను విన్నవించారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రజలకుసదుపాయాలు కల్పించాలని కోరారు. ఇందులో ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని పలు రోడ్లను తన తండ్రి రహదారులు, భవనాల శాఖామా త్యులుగా ఉన్నపుడు పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బికి



మార్చారని అయితే తరువాత నిధుల కొరతతో సమస్యాత్మకంగా మారాయని మంత్రికి వివరించారు. నియోజక వర్గంలోని 11 చోట్ల లోలెవల్ కాజ్‌వేలు ఉండటంతో వర్షాకాలం వస్తే గ్రామాల ప్రజలకు నియోజకవర్గ కేంద్రంతో సంబం ధాలు తెగిపోతు న్నాయని వివరించారు. ముఖ్యంగా మునగల పాళెం-పాపానాయుడు పేట, శ్రీకాళహస్తి-కాసరం (కే.కే.జి) రోడ్డు, కనపర్తి-పల్లం పేట, మన్నవరం రింగ్ రోడ్డుల గురించి వివరించారు. ఇక తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు- బోనుపల్లి, కారాకొల్లు ప్రాంతాలలో వర్షాకాలం వస్తే అవి ద్వీపాల వలె మారుతున్నాయని వివరించారు. శ్రీకాళహస్తి మండలంలోని సున్నపు కాలువ, ఉదమల పాడు, పాపానాయుడు పేట -గుడిమల్లం మధ్య వంతెనల ఏర్పాటు చేయాల్సి ఉందని మంత్రికి సుధీర్‌రెడ్డి వివరించారు. ఇక శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ఆర్‌అండ్‌బి రోడ్లు పక్కన కాలువలేకుండా సిమెంటు రోడ్లు నిర్మించారు. దాంతో వర్షాకాలం రోడ్ల మీద నీళ్ళు నీరు నిల్చి ఇబ్బందిగా మారిందని మంత్రి సుధాకర్‌రెడ్డికి వివరించారు. ఈ పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని సుధీర్‌రెడ్డి అభ్యర్థించారు. ఎంఎల్‌ఏతో పాటు మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

## ఊరందూరులో మంత్రికి ఆతిధ్యం



**శ్రీకాళహస్తిరూరల్, జూలై 22 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులతో రాగా శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్ధనమేరకు ఊరందూరు గ్రామానికి వచ్చారు. అక్కడ మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మతో పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి అల్పాహార విందు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు కలసి మంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో రంగినేని చెంచయ్యనాయుడు, ఢిల్లిబాబు, పేరం ధనం జయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండ: తెలుగుదేశం జెండా

శ్రీకాళహస్తిరూరల్, జూలై 22 ప్రభాతవార్త



నిరుపేదలకు అండగా తెలుగుదేశం జెండా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిమందలో ఏడాది కూటమి పాలలో సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమాలను నిర్వహించారు. ఏడాదిలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిపాలన శాంతికి నిలయంగా మారిందన్నారు. ఓ వైపు అభివృద్ధి మరో వైపు ఆధ్యాత్మిక చింతనతో సాగుతుందన్నారు. గతంలో దోచుకో దాచుకో అంటూ పరిపాలించారని నేడు జవాబుదారి తనంతో పరిపాలన సాగిస్తుందన్నారు. ఆది నుంచి తెలుగుదేశం జెండా పేదలకు అండగా నిలుస్తుందన్నారు. నాడు గోపాలకృష్ణారెడ్డి అభివృద్ధికి పునాదులు వేస్తే నేడు ఆయన తనయుడు భవనాలు నిర్మిస్తున్నారన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తానున్నానని ముందుకు వచ్చి అధికారులను పరుగులు తీయిస్తున్నారని నాగరాజున ఆయుడు అన్నారు. ఈ కార్యక్రమాల్లో నాగరాజు నాయుడుతో పాటు రెడ్డివారి గురువారెడ్డి, పేరం ధనంజయులు నాయుడు, పున్నారావు, శివశంకర్‌రెడ్డి, బత్తల గిరిబాబునాయుడు, రవి నాయుడు, బాబు నాయుడు, మునెయ్య, కృష్ణప్ప మొదలి, సుబ్రమణ్యం, మురళి, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

## మైనారిటి ముస్లిం నాయకుని సత్కరించిన శ్రీకాళహస్తి ముస్లింలు



**తొట్టంబేడు, జూలై 22 ప్రభాతవార్త** రాష్ట్ర మైనారిటి కార్పొరేషన్, మైనారిటి సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలాని షేక్ ముస్తాఖ్ అహ్మద్‌ను శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో శ్రీకాళహస్తిమైనారిటి నాయకులు సత్కరించారు. మంగళవారం తిరుపతి పట్టణంలోని తెలుగుదేశం కార్యాలయంలో ఆయన్ను కలసి మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా మౌలానా ముస్తఖ్ ఆహమ్మద్ మాట్లాడుతూ టిడిపి ప్రత్యేక కార్యక్రమాలను ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో మైనారిటీల అభివృద్ధికి పని చేస్తున్నారన్నారు. తాజాగా మైనారిటియూనివర్శిటీల నిర్మాణానికి శంకు స్థాపన చేయటం వరం అన్నారు. అలాగే హజ్ హౌస్ నిధుల నుంచి సబ్సిడీల రుణాలు, మౌజన్‌లు, ఇమాంలకు గౌరవవేతనాలివ్వటం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమాల్లో షాకిర్ అలి, ఖాధర్‌బాషా, జిలాని బాషా, షఫీ, అస్మత్, మస్తాన్, కరీం, ఫ్రూట్‌మీర్జా, అబ్దుల్ కరీం, జహీర్, మీర్జా, నయిం, ముజీబ్ పాల్గొన్నారు.

## ముదిరాజులకు అండదండగా ఉంటా....

రేణిగుంట జూలై 22 ప్రభాతవార్త



ముదిరాజులకు ఎల్లప్పుడు అండదండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని జాతీయ కోలీ ముదిరాజ్ సంఘం తిరుపతి జిల్లా చైర్మన్ కుర్ర కాలవ వేణు అన్నారు. రేణిగుంట మండలం కుర్ర కాలవ గ్రామం నందు మంగళవారం రాష్ట్ర ముదిరాజు సంఘం (జాతీయ కోలీ సమాజ్) ప్రథమ మహాసభ జరిగింది. అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన అధ్యక్షులు రెడ్డి బాబు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు బాలకృష్ణ, ఓబులేసు, శ్రీను, విద్యార్ధి విభాగం మణికుమార్, కళ్యాణ్ సమక్షంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. తిరుపతి జిల్లా చైర్మన్ కుర్ర కాలవ వేణుగోపాల్, తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదం మునయ్య, ఉపాధ్యక్షులు కోనేటి అయ్యప్ప, కుంట్ర పాకమునిస్వామి, పులుసు పాండురంగయ్య, ప్రధాన కార్యదర్శులు కొప్పుల సురేష్, కుంట్రపాకు మునిరాజ్, కార్యదర్శులు తండ్లం లోకేష్, మర్రికుంట ప్రేమ్ కుమార్, బొజ్జా శివ, సంతపేట జ్ఞాన శేఖర్, సోషల్ మీడియా సెక్రెటరీ పెమ్మి గారి నరేంద్ర, కోశాధికారి సుబ్రమణి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రకాష్, చంద్రశేఖర్, చంద్రమోళి, గురవయ్య, యువరాజ్, కమలాకర్, పవన్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సుపరిపాలనకు తొలి అడుగుకు అడుగడుగునా జన నీరాజనాలు



**రేణిగుంట జూలై 22 ప్రభాతవార్త** రేణిగుంట పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్న సుపరిపాలనలో తొలి అడుగు కు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు సమర్పించారు. ముందుగా మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీరికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రజల సంక్షేమానికి ఎన్ డి ఏ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని మంత్రి, ఎమ్మెల్యే సంయుక్తంగా తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్చార్జి ఎంపీడీవో ప్రభురావు, సీఐ జయచంద్ర, తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్బాషా, పార్టీ సీనియర్ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిస్వామి నాయుడు, డి పుష్పనాదం, బుజ్జి నాయుడు, భాస్కర్ యాదవ్, నాదముని రెడ్డి, ముచ్చెలి భాస్కర్ రెడ్డి, అగ్రహారం భాస్కర్ రెడ్డి, పాడి రాజేంద్ర, కన్నన్ రెడ్డి, బొబ్బిలి రెడ్డి, డాక్టర్ మర్దాల రవిబాబు, నవాబ్, కొరియర్ రవి, సూరిబాబు, కాకి భాస్కర్, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు మండల వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో మంత్రి జనార్ధనరెడ్డి



***శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త*** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరునిమంగళవారంరాష్ట్ర రహదారులు, భవనాల, మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మాత్యులుబి.సిజనార్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. మంత్రి కుటుంబసభ్యులతో రాగా ఆలయ పరిపాలనా భవనాల వద్ద శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, మాజీ వ్యవసాయమార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఢిల్లి బాబు తదితరులు స్వాగతం పలికారు. కాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి ఆలయ ప్రాశస్త్యం గురించి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించగా వవేదపండితులు ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## ఎస్వీయూ స్నాతకోత్సవం నిర్వహించండి

తిరుపతి విద్య, జూలై 22 ప్రభాత వార్త:



ఎస్వీయూ స్నాతకోత్సవంపై అధికారులు పట్టించుకోకపోవ డంతో విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందని జీఎస్ఎన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శివ శంకర్ నాయక్ ఆవేధన వ్యక్తం చేశారు. ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడును మంగళవారం కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో 62వ కాన్వకేషన్ నిర్వహించడం జరిగిందని అప్పటి నుంచి కాన్వొకేషన్ నిర్వహించకుండా జాప్యం చేస్తూ విద్యార్ధులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. డిగ్రీ, పీజీ పూర్తి అయిన పేద విద్యార్థులు ఇన్ అడ్వాన్స్ ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతూ ధృవపత్రాలను తీసుకోలేకపోతున్నారని తెలిపారు. కోర్సు పూర్తయిన తర్వాత ఉద్యోగాలు పొందిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు కాన్వకేషన్ సర్టిఫికెట్ కోసం వర్సిటీ పరిపాలనా భవనం చుట్టూ తిరుగుతున్నారని మండిపడ్డారు. ఇన్ అడ్వాన్స్ సర్టిఫికెట్ ఫీజులు వేల రూపాయలు కట్టలేక నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని కాన్వకేషన్ నోటిఫికేషన్ ఇచ్చినట్లయితే తక్కువ ఫీజులకే సర్టిఫికేట్ అందుతుందన్నారు. వెంటనే అధికారులు చొరవ చూపి స్నాతకోత్సవాన్ని నిర్వహించాలనిడిమాండ్‌చేశారు. నాయకులుచంద్రశేఖర్ నాయక్, సురేంద్ర, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జూలై 22 ప్రభాతవార్త



ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన "ఆరా ఆఫ్ ఆర్ట్స్ మ్యాగజైన్ "ను వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సుధా రాణి మంగళవారం వర్సిటీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో గణనీయమైన చరిత్ర కలిగిన యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగ కార్యాలయం ప్రకాశం భవనంలో వుండడం, అలాగే ఆర్ట్స్ కళాశాల పేరు ప్రతిబింబించేలా ఆరా పేరుతో ఈ మ్యాగజైన్ తీసుకుని రావడం హర్షనీయమన్నారు. ఆరా అనే పదానికి ప్రకాశించు అనే అర్ధం వస్తుందని అన్నారు. మ్యాగజైన్లో విద్యార్థుల కవితలు, వ్యాసాలు, వివిధ శాఖల పురోభివృద్ధి, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో సాధించిన విజయాలు వంటి వాటితో ప్రకాశిస్తుందని, ఇది దాదాపు 200 పైచిలుకు పుటలు కలిగిన డాక్యుమెంటరీ వంటి పుస్తకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య భాస్కర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య సుమకిరణ్, వార్డెన్ ఆచార్య ప్రయాగ, ఆచార్య రాజేశ్వరమ్మ, ఆచార్య అమీనుల్లా, డాక్టర్ ఓబులేసు, రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో శిల్పారామం చైర్‌పర్సన్



శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం రాష్ట్ర శిల్పారామం చైర్ పర్సన్ సిహెచ్‌మంజులా రెడ్డి కుటుంబసభ్యులతో కలసి పూజలు జరుపుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రాష్ట్ర గిరిజనసలహామండలి సభ్యుడు ఎం.సుబ్బయ్య సారధ్యంలోవారికిస్వాగతంపలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి సుబ్బయ్య స్వామిఅమ్మవార్లచిత్రపటాలను అందించారు. ఆలయ వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలను అందిం చారు.

## అంజేరమ్మకు మొక్కులు తీర్చకున్న విజయ్

శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా బొజ్జల సుధీర్‌రెడ్డి గెలవాలని ఎన్నికలకు ముందు వడమాల పేట సమీపం లోని అంజేరమ్మ కనుమలో మొక్కుకున్నారు. శాసనసభ్యుడుగా సుధీర్‌రెడ్డి నభూతో అన్నట్లు 43వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు కుటుంబంతో వెళ్ళి అమ్మవారికి మొక్కులు తీర్చకున్నారు. పూజలు జరిపించారు. అమ్మవారికి అభిషేకాలు జరిపించారు. భక్తులకు అన్నదానం జరిపి మొక్కులు తీర్చుకున్నారు. రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వం శ్రీకాళహస్తిలో సుధీర్‌రెడ్డి సమర్థవంతగా పరిపాలించి ప్రజల మన్ననలనుఆ ఒదుకోవాలని కోరుతూ పూజలు జరిపించినట్లు వివరించారు.

## స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి: ఆర్ధిక భారాన్ని తగ్గించుకోండి

వామపక్ష ప్రజా సంఘాల పిలుపు

తొట్టంబేడు, జూలై 22 ప్రభాతవార్త




విద్యుత్ శాఖ వినియోగదారులపై ఆర్ధిక భారం మోపటానికి రూపొందించిన స్మార్ట్ మీటర్లను వినియోగదారులు అడ్డుకోవాలని ఒక వేళ నిర్బంధంగా ఏర్పాటు చేయటానికి ప్రయత్నిస్తే ధ్వంసం చేయాలన్నారు. సిఐటియు కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా న్యాయం జరగటం లేదన్నారు. యువగళం పాదయాత్రలో నారాలోకేష్ అప్పటి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే పగల గొట్టండని పిలుపు నిచ్చారు. మరి వారు అధికారంలోకి వచ్చి 15నెలలు దాటుతునాన ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించారు. ట్రూఅప్ చార్జీలు, అదనపు చార్జీలు, స్మార్ట్ మీటర్లంటూ ఇంకా దోపిడి జరుగుతుంటే ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నది కూటమి కాబట్టి ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల బిగింపుతో రానున్న రోజుల్లో విద్యుత్ రంగం ఆదాని చేతుల్లోకి పోతుందన్నారు. గృహ, వ్యవసాయ అవసరాలకు విద్యుత్‌ను కొని వాడుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుందన్నారు. అదే జరిగితే మరో ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమాల్లో వామపక్ష నాయకులు దొడ్డా గోపి, గంధం మణి, పెనగడం గురవయ్య, అన్వర్ బాషా, లాల్‌బాషా, కుమార్, ఎస్ఎం షరీఫ్ పులి శ్రీకాంత్, గోవిందయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మిధున్‌రెడ్డి అరెస్టు అన్యాయం

శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త

మద్యం కేసులు రాజంపేట పార్లమెంటు సభ్యులు మిధున్‌రెడ్డిని అరెస్టు చేయటం అన్యాయమని వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్‌బాషా అన్నారు. మంగళవారం ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి తమ మద్దతును తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వైకాపా ద్వితీయశ్రేణి నాయకులపై కక్ష సాధింపుగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారని ఈ నేపథ్యంలోనే మిధున్‌రెడ్డిపై అక్రమంగా కేసు బనాయించి ఇబ్బంది పెడుతున్నారని సిరాజబాషా అన్నారు.

# మామిడి రైతులను మాటల్లో కాదు చేతల్లో ఆదుకున్న కూటమి

## మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్



తొట్టంబేడు, జూలై 22 ప్రభాతవార్త

పీకల్లోతు నష్టాల ఊబిలో కూరుకుపోతున్న మామి డి రైతులను ప్రచారం కోసం కాకుండా చేతల్లో ఆదుకున్న మనసున్ననాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని తొట్టంబేడు వ్యవసాయ కమిటి మాజీ చైర్మెన్ జయచంద్రనాయుడు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూఉమ్మడి చిత్తూరుజిల్లాలో కూటమి ప్రభుత్వం మామిడిరైతులకు కిలోకు రూ.4లు సబ్సిడీ ఇవ్వనున్నారని రాష్ట్ర వ్యాప్తంగా రూ.150కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయటానికి నిర్ణయించుకోవటం రైతుల పట్ల ముఖ్యమంత్రికిగల గుర్తింపుకు నిదర్శనం అని జయచంద్రానాయుడు అన్నారు. ఇతర ప్రాంతాలకు తరలించిన మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం మద్దతు ధర లభిస్తుందన్నారు. ఈ ఏడాది మామిడి విపరీత దిగుబడి రావటంతో గిట్టుబాటు ధరలు లభించలేదన్నారు. ఈ సమస్యలను క్షేత్ర స్థాయిలోపరిశీలించుటకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వ్యవసాయశాఖ మంత్రి ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పర్యటించి రైతులతో, పల్స్ ఫ్యాక్టరీలతో, ప్రతినిధులతో సమావేశం జరిపి వారి అభిప్రాయాలను సేకరించారన్నారు. ఫ్యాక్టరీలు తక్కువ ధరలకు కోరారని ఈ సమస్యపై స్పందించి కేజీ మామిడి కాయలను రూ.8లకు కొనాలని రూ.4లు సబ్సీడీ ప్రభుత్వం భరించుటకు నిర్ణయించిందని జయచంద్రనాయుడు తెలిపారు.

ఈ సమస్యపై రాష్ట్ర మంత్రి వర్గం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వివరించి సబ్సీడీ నగదులో 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు చెల్లించే నగదును చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నారని వివరించారు.

మామిడి రైతులకు క్వింటాలుకు రూ.1,490లు కేంద్రం ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని వివరించారు.

# తిరుపతి డివిజన్

## సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి




**పుత్తూరు, జూలై 22 ప్రభాతవార్త :** సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో పాశుపతాస్త్రం లాంటిదని అందువల్ల ప్రతి ఒక్కరు ఈ చట్టంపై అవగాహన కలిగి వుండాలని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. 2005వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమాచార హక్కు చట్టానికి 20 ఏళ్ళ పూర్తయిన సందర్భంగా మంగళవారం కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచడానికి, అవినీతి నియంత్రణ కోసం ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని చేసిందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుంటే ప్రజలు అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఇదే సమయంలో కొంత మంది స్వార్ధపరులు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయడం దురదృష్టకరమని తెలిపారు. త్వరలోనే ఈ చట్టం గురించి వివిధ పోటీలు నిర్వహించి విద్యార్ధులకు బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, అధ్యాపకులు డాక్టర్ మన్యం నరసింహులు, ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, సావిత్రి, సూర్యబాబు, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## నగరు వీధుల్లో తిరుచ్చివాహనంపై ఊరేగిన ఆండాల్ అమ్మవారు



**నారాయణవనం, జూలై 22 ప్రభాతవార్త :** ఆడినెలలో ప్రారంభమయ్యే ఆండాల్ అమ్మవారి తిరువాడిపుర ఉత్సవాలు మంగళవారం సాయంత్రం మూడవ రోజుకు చేరింది. నారాయణవనం మేజర్ పంచాయతీలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదే సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో కొలువుదీరిన ఆండాల అమ్మవారి తిరువాడిపుర ఉత్సవం 10 రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం జరుగుతుందని టిటిడి పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు. సోమవారం సాయంత్రం అమ్మవారిని తిరుచ్చివాహనంపై అధిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ నగరు వీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. భక్తులకు ప్రసాదాలను అందించారు.

## అనుమతులు లేకుండా ఎరికంబట్టు చెరువులో మట్టి తరలింపు..!

నారాయణవనం, జూలై 22 ప్రభాతవార్త :



మండలంలోని ఎరికంబట్టు చెరువులో పగలు, రాత్రి అనే తేడా లేకుండా చెరువు మట్టిని జెసిబి, ట్రాక్టర్లతో తరలిస్తున్నట్టు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గత కొద్దిరోజులుగా పుత్తూరు మండలం చౌటూరుకు చెందిన ఓ వ్యక్తికి చెందిన జెసిబితో ఎరికంబట్టు దళితవాడకు చెందిన ఓ నాయకుడి అండతో ఈ తతంగా జరుగుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే చెరువులో మట్టిని ఎలా తీస్తారని ప్రశ్నిస్తున్నారు. కేవలం రాజకీయ నాయకుల అండతోనే ఎరికంబట్టు చెరువులోని మట్టిని తీసుకెళ్లి పుత్తూరు మండలంలో కమర్షియల్ పనులకు ఉపయోగిస్తున్నట్టు మండిపడ్డారు. ఈ చెరువులోని మట్టిని తీసుకెళ్లి ట్రాక్టర్ మట్టిని 1000 రూపాయాల వరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా తరలింపును పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టనట్టు వ్యవహరించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల స్థాయి అధికారులకు సొమ్ము ముట్టడంతోనే ఇలా జరుగుతున్నట్టు ఆరోపించారు. త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

## 25న కైలాసకోన వేలంపాట : ఇఓ

నారాయణవనం, జూలై 22 ప్రభాతవార్త :

మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ కైలాసకోనలో వెలసిన కామాక్షాంబిక సమేత కైలాసనాధుని ఆలయంలో ఈనెల 25వ తేది శుక్రవారం ఉదయం 10.30గంటలకు వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఇఓ ఎం కృష్ణానాయక్ తెలిపారు. వేలంపాటలో తాత్కాలిక అంగళ్లు, హోటళ్లు, శీతలపానియాలు, పూజా సామాగ్రీలు, పనస, ముంతమావిడి, మామిచెట్టు, 3 ఎకరాలలో వ్యవసాయం చేయుటకు వేలంపాట నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆశక్తి కలిగిన వారు వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

## కూటమి ప్రభుత్వపాలనలోనే అభివృద్ధి సంక్షేమం

విజయపురం, జూలై 22 ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తుందని, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని కోసలనగరం సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్ పేర్కొన్నారు. సుపరిపాలంలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని జంబాడ పంచాయతీ పరిధిలో టీడీపీ నాయకులు గత ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమంపై కరపత్రాలను ప్రజలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని ఇప్పుడిప్పుడే టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవిరాజు, శ్రీరాములరాజు, కపిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేరళ మాజీ సీఎం అచ్చుతానందన్ చిత్రపటానికి ఘన నివాళి

పుత్తూరు రూరల్, జూలై 22 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని ఆటో స్టాండ్ వద్ద కేరళ మాజీ సీఎం అచ్చుతానందన్ చిత్ర పటానికి సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేరళ సీఎంగా ఎన్నికై పేద ప్రజల కోసం అనేకమైన చట్టాలు తీసుకొచ్చి, భూ సమస్యలు పరిష్కరించారని తెలిపారు. సీపీఎం నాయకులు వెంకటేష్, విజయ్, శివ, రమేష్, కృష్ణమూర్తి, కుమార్, రవి, ప్రవీణ్‌కుమార్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనతోనే సంక్షేమం, అభివృద్ధి పరుగులు

పుత్తూరు రూరల్, జూలై 22 ప్రభాతవార్త:



తెలుగుదేశం కూటమి పరిపాలనతోనే రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం కొనసాగుతున్నాయని పుత్తూరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్‌లు పేర్కొన్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జి గంజిమాధవయ్య ఆధ్వర్యంలో పుత్తూరు రూరల్ మండలం నేసనూరు గ్రామ పంచాయతీ కల్యాణ వెంకటేశ్వరపురంలో, తొరూరు పంచాయతీ పైడిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి, ఇంటింటికి తెలుగుదేశం కూటమి పరిపాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను, రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి బాలకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు భాస్కర్‌నాయుడు, జేసీబీ చిన్నా, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు



సప్తగిరిఎక్స్‌ప్రెస్ బస్సులు మెరుగైన నిర్వహణ

తిరుపతి రవాణ, జూలై 22 ప్రభాతవార్త

రాబోవు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతి-తిరుమల మధ్య భక్తులకు మెరుగైన రవాణా సేవలందించడానికి 11డిపోల నుండి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల నిర్వహణ తీరుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం అశోక్‌లేలాండ్, బ్రేక్స్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్, వాట్కో, ఈఎంఆర్ బ్రేక్స్, అమరాన్‌బ్యాటరీస్ సంయుక్తంగా ఘాట్‌డిపోల ఏపిఎస్‌ఆర్టీసి మెయింటెనెన్స్ సిబ్బందికి బ్రేక్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ సిస్టమ్, బ్యాటరీ నిర్వహణ వంటి కీలక వ్యవస్థలపై సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచడంపై శిక్షణ జకిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి సీనియర్ ఇంజనీర్ సూర్యనారాయణనేతృత్వం వహించారు. ప్రతి డిపోగ్యారేజీ నుండి గ్యారేజీ ఇన్‌ఛార్జి, ఎలక్ట్రిషియన్, బ్రేక్ మెకానక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌లేలాండ్ సీనియర్ ఇంజనీర్ సూర్యనారాయణ, ఆర్టీసి డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.బాలాజీ, ఏఈ మెకానిక్ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి.



***తిరుపతి విద్య జూలై 22 ప్రభాత వార్త:*** స్థానిక న్యూ బాలాజీ కాలనీ లోని నారాయణ ఏటీపీ బ్రాంచ్ పాఠశాలలో పిల్లలకు పుస్తక పాఠాలు బోధిస్తూనే నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా ఐదు నుండి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు హెడ్ బాయ్స్, హెడ్ గాల్స్ అనే నాయకులను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటింగ్ విధానం ద్వారా ఎన్నుకున్నారు. అందులో విజేతలుగా నిలిచిన నాయకులను పాఠశాల నాయకున్ని ప్రత్యేకంగా పాఠశాల డీజీఎం కొండలరావు, ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ ఐ వసంత్, ప్రిన్సిపాల్ షాహిద్ బాషా ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేసి అభినందనలు తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏజీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, విద్యార్థులు రాబోయే తరాలకు ఆదర్శప్రాయంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్మార్టు క్లాస్‌రూమ్‌ను ప్రారంభించిన మంచు లక్ష్మి



నాయుడుపేట, జూలై 22 ప్రభాతవార్త: పట్టణంలోని రాజగోపాలపురంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో స్మార్టు క్లాస్‌రూమ్‌ను ప్రముఖ సినీనటి మంచు లక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రముఖ సినీనటి మంచు లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కార్పోరేటు స్థాయిలో విద్యను అందించాలన్న ఉద్దేశంతో టీచ్‌పర్ చేంజ్ పౌండేషన్ ద్వార రెండు తెలుగు రాష్ట్రాలలో 320 ప్రభుత్వ పాఠశాలలో స్మార్టు క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యలను సాధించాలని ఆమె ఆకాంక్షించారు. తన అమ్మమ్మ స్వగ్రామమైన నాయుడుపేటలో స్మార్టు క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పలువురు తెదేపా నాయకులు మంచు లక్ష్మిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అమరా గార్డెన్‌లో ఉన్న ఆమె తల్లి స్మృతివనంలో కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళర్పించారు. ఈకార్యక్రమంలో ఎమ్ఈఓ మునిరత్నం, తెదేపా నాయకులు నానభాల సుబ్బారావు, అవదానం సుధీర్, జువ్వలపాటి మస్తాన్‌రావు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## తిరుపతి జిల్లా బిజెపి కార్యదర్శిగా బెజవాడ



సూళ్లూరుపేట, జులై 22 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యదర్శిగా సూళ్లూరుపేటకు చెందిన బెజవాడ విజయ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడంలో రాష్ట్ర అధ్యక్షులు మాధవ, మాజీ ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు తనకెంతో సహకరించారని అన్నారు. ఇప్పటివరకు తాను బిజెపి మహిళా మోర్చా కార్యవర్గంలో పనిచేస్తున్నానని, ప్రస్తుతం తనకు వచ్చిన పదవికి న్యాయం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

## ఎస్ఎంఎల్‌సి చర్చికు రూ.లక్ష విరాళం



కోట, జూలై 22 ప్రభాతవార్త : మండలంలోని తిన్నెలపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న చర్చికు అమెరికాలో సంఘ కాపరిగా పనిచేస్తున్న రె.వె.ఏలినా గోమలకర్, వారి సంఘం నుంచి కానుకగా డా.విజయభాస్కర్, డా.కె.జయరావు ద్వారా పంపిన నగదును తిన్నెలపూడి సంఘస్తులకు రెవె.సన్నీ ద్వార అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు చైర్మెన్, బిప్రభుచరణ్, కుమూర్, ఎడ్యుకేషన్ చేర్మెన్, జి.రవి, కారల్ దయాకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



సూళ్లూరుపేట, జులై 22 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు గత పదిరోజులుగా ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సచివాలయ ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రూ.3,500 పెంచినట్లు జీఓ ఇచ్చారని, కానీ ఈ జీఓ ప్రకారం కాకుండా పాత జీఓ ప్రకారం జీతాలు పెంచాలని కోరారు. ఇదే వైఖరి కొనసాగితే సమ్మె ఉధృతం చేస్తామని మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. ఈ సమ్మెకు మద్దతుగా ఆటో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లక్ష్మయ్య, రియాజ్, సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేంద్రరెడ్డి



పెళ్లకూరు, జూలై 22 ప్రభాతవార్త : మండలంలోని పాలచ్చురు గ్రామానికి చెందిన ఎదల నరేంద్రరెడ్డిని బిజెపి అధిష్టానం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించడంపై మండలంలోని బిజెపి నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. దీనిపై ఎద్దుల నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రెండవసారి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించినందుకు పార్టీకి అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటూ వారి యోగక్షేమాలకు కృషి చేస్తానన్నారు.

## రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ నియంత్రణకు శ్రీకారం



సూళ్లూరుపేట, జులై 22 ప్రభాతవార్త : పట్టణ నడిబొడ్డులోని ఎల్‌సి-60 రైల్వే గేటు వద్ద గత కొన్నేళ్లుగా ట్రాఫిక్ నియంత్రణ లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో దక్షిణ రైల్వే అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు మంగళవారం శ్రీకారంచుట్టారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రత్యేక చొరవ తీసుకుని రైల్వే అధికారులు విన్నవించారు. ఈ నేపథ్యంలో గత నాలుగేళ్ల క్రితం అండర్ బైపాస్ బ్రిడ్జి నిర్మించేందుకు సిద్ధంగా ఉంచిన సిమెంటు అచ్చులు ట్రాఫిక్‌కు అవరోధంగా మారాయి. వీటిని తొలగించాలని పలుమార్లు రైల్వే అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు భారీ క్రేన్ సహాయంతో సిమెంటు అచ్చులను ప్రస్తుతం ఉన్న స్థానం నుంచి నాలుగు మీటర్లు వరకు పక్కకు జరిపారు. ఈ నేపథ్యంలో రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ నియంత్రణకు మార్గం సుగమం అయింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలతో రాష్ట్రం ప్రగతిపథంలోకి వెళుతుందన్నారు. ప్రస్తుతం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ నియంత్రణ చేసిన రైల్వే అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అలాగే సూళ్లూరుపేట జాతీయ రహదారి సమీపంలో ఉన్న కంపోస్ట్ యార్డులో చెత్తను తొలగించే ప్రక్రియ విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇటీవల రేణిగుంటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి కాళంగి బ్రిడ్జి విషయమై వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలోనే నిధులు మంజూరుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, దంతాల రవి, ఆలీభాయ్, ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేయడమే అజెండా : ఎంఎల్‌సీ



కోట, జులై 22 ప్రభాతవార్త: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడమే మనందరి అజెండా అని ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ అన్నారు. మంగళవారం కోట మండలం విద్యానగర్‌లో నేదురుమల్లి సుబ్బ రామరెడ్డి కళాభవన్‌లో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నాపై కూడా కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, అందుకు తాను స్వాగతిస్తు న్నానని చెప్పారు. మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ అంతా మోస మని ప్రజలు ఇప్పుడు తెలుసుకుంటున్నారని చెప్పారు. కార్యకర్తలు కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొడవలూరు ధనంజ యరెడ్డి మాట్లాడుతూ ముందుగా గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసుకోవాలన్నారు. అనంతరం పుచ్చలపల్లి జలసంఘం మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు బాగుంటేనే నాయకులు బాగుంటారని, నాయకులు బాగుంటేనే సీఎం బాగుంటారని చెప్పారు. మండల కన్వీనర్ సంపత్ కుమార్‌రెడ్డి, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు వెంకటరమణారెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, కస్తూరిరెడ్డి, సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ నరమాల వెంకట రమణయ్య, చిట్టమూరు మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర బిసి జనరల్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం యాదవ్, కోటారెడ్డి, శివరామ నాయుడు, మాజీ జడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి, శశిరెడ్డి, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి దర్శన టికెట్ల జారీ నూతన కేంద్రం ప్రారంభం



తిరుమల, జూలై 22 ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి భక్తులకు మరింత సౌకర్యవంతంగా శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రాన్ని మంగళవారం టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు, టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రారంభి ంచారు. అత్యాధునిక మౌలక సదుపా యాలతో 60 లక్షల వ్యయంతో కొత్త కౌంటర్లను నిర్మించినట్లు తెలిపారు. నేటి నుంచి కౌంటర్ల ద్వారా భక్తులకు టికెట్ల పంపిణీ ప్రారంభమ వుతుందని, భక్తులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం హెచ్‌వీసీ, ఏఎన్సీ ప్రాంతాల్లో భక్తుల సౌలభ్యం కోసం నూతనంగా ఆధునీకరించిన ఉప విచారణ కార్యాలయాలను టిటిడి చైర్మన్ ప్రారంభించి భక్తుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాలయాలను పరిశీలించారు.

## స్థానికులకు న్యాయం చేస్తాం

### -తుడ చైర్మన్,టిటిడి బోర్డు సభ్యుడు దివాకర్‌రెడ్డి



తిరుమల, జూలై 22ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో అనాదిగా నివాసముంటున్న స్థానికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తుడ చైర్మన్, టిటిడి బోర్డుసభ్యుడు సి.దివాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం తిరుమల ఆర్‌బి సెంటర్‌లో నివాసముంటున్న స్థానికుల ఇళ్ళ వద్దకు బోర్డు సభ్యుడు శాంతారాంతో కలసి పర్యటించారు. స్థానిక మహిళలు, వృద్ధులు మాట్లాడుతూ తరతరాలుగా తిరుమలలో తాము నివాసముంటున్నామని, తమను మరో ప్రాంతానికి తరలించకుండా ఇక్కడే ఉండే విధంగా చూడాలని కోరారు. ఈ విషయంపై పాలకమండలిలో చర్చించి సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## ముదిరాజ్ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడుగా శివకుమార్



తిరుపతికార్పొరేషన్, జూలై 22ప్రభాతవార్త: తిరుపతికి చెందిన పోలి శివకుమార్ జాతీయ కోలి ముదిరాజ్ సంక్షేమసంఘం రాష్ట్రయువజన ఉపాధ్యక్షుడుగా నియమితులయ్యారు. జాతికి విశిష్ట సేవలందించగలరనే నమ్మకంతో ఆయనకు ఈ పదవిని అప్పగించారు. అన్ని వర్గాలను సమీకరిస్తూ రాజకీయాలకు అతీతంగా జాతి సమగ్రతకు, సర్వతోముఖాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని శివకుమార్‌తెలిపారు. ఈ పదవిలో ఆయనను నియమిస్తూ రాష్ట్రయువజన అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు నియామక ఉత్తర్వులు ఇచ్చారు.

## బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్



వి.కోట, జూలై 22 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొంగాటంకు చెందిన గౌనివారి విజయ్‌కుమార్‌ను నియమించారు. ఈమేరకు జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడునుంచి ఆయన నియామక పత్రాలు అందుకున్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం పథకాలు ప్రజల్లో తీసుకెళ్తామన్నారు.

## అలనాటి దొరతనానికి నిదర్శనం నేటి రాజగోపురం



చౌడేపల్లి, జూలై 22 ప్రభాతవార్త: శతాబ్దాల తరబడి ఈ ప్రాంతం జమీందారుల ఏలుబడిలో వుండేది. పుంగనూరు కేంద్రంగా జమీందార్లు పాలించేవారు. పలు గ్రామాలు వారిపేరున ఇప్పటికీ పిలువబడు తున్నాయి. స్థానికంగా వెలసిన శ్రీఅభీష్టద మృత్యుంజయుని ఆలయాన్ని జమీందారు చిక్కరాయలు 600యేళ్ళ క్రితం నిర్మించారు. అప్పట్లో ఆలయం ముందు 52అడుగుల ధ్వజ స్తంభాన్ని నిలబెట్టలేక జమీందారు చిక్కరాయలు పుంగనూరు వెనుతిరిగాడు. ఆలయ నుంచి కిలో మీటరు దూరం వెళ్ళగానే మార్గం మద్యలో ఓ బ్రాహ్మణుడు ఎదురుపడి నిరాశతో వెళ్ళొద్దు వెనుతిరిగి చూడమని చెబుతాడు. వెంటనే జమీందారు చూసేసరికి అక్కడ ధ్వజ స్తంభం నిలబడివుంటంది. ఆ వెనువెంటనే బ్రాహ్మణున్ని చేస్తే ఆయన మాయమవుతాడు. సాక్షాత్తు పరమశివుడే ప్రత్యక్షమై ధ్వజ స్తంభాన్ని ఎత్తించాడని బ్రాహ్మణుడు కనిపించిన ప్రదేశంలో పుష్కరిణి తవ్వించి, రాజగోపురాన్ని ఏర్పాటు చేసాడు. ప్రస్తుతం దొరబావిగా పిలువబడుతూ నాటి దొరతనానికి నిదర్శనంగా నిలబడింది. ఆయనచే నిర్మితమైన కోనేరు రాజగోపురం చెక్కుచదరకుండా నాటి పాలకులను గుర్తుకు తెప్పిస్తున్నాయి.

## ధనంజయరెడ్డికి ఘన సన్మానం



కోట, జులై 22 ప్రభాతవార్త: రాష్ట్ర వైసీపీ కార్యదర్శి కొడవలూరు ధనంజయరెడ్డి తొలిసారిగా కోట మండలం విద్యానగర్‌లో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. యువజన నాయకుడు చిల్లకూరు సాయి ప్రసాద్‌రెడ్డి, మద్దాలి నాగరాజు, కోటారెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు గజమాలతో ధనంజయరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆ క్రమంలోనే ఎంఎల్‌సీ మేరిగ మురళీధర్.. ధనంజయరెడ్డిని సన్మానించారు. యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు వెంకట రమణారెడ్డిలు కూడా ధనంజయరెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## వైసీపీ రాష్ట్ర బిసి సెల్ జనరల్ సెకట్రరీగా సుబ్రహ్మణ్యం

కోట, జులై 22 ప్రభాతవార్త: వైసీపీ రాష్ట్ర బిసి సెల్ జనరల్ సెక్రటరీగా కోట మండలం ఊను గుంటపాలెం గ్రామానికి చెందిన ముంగమూరి సుబ్రహ్మణ్యం యాదవ్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఆ మేరకు కార్యకర్తలు, అభిమానులు సుబ్రహ్మణ్యం యాదవ్‌ను పూలమాలలతో సత్కరించారు. ధనంజయరెడ్డికి సుబ్రహ్మణ్యం యాదవ్ ముఖ్య అనుచరుడు

## భోజన పథకంలో మెనూ తప్పనిసరి : డిఈఓ



నాయుడుపేట, జూలై 22 ప్రభాతవార ్త: రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని తిరుపతిజిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్ కునార్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళ వారం నాయుడుపేట విశ్వం జూనియర్ కళాశాలలో గూడూరు డివిజన్‌లోని 14మండలాలోని విద్యా శాఖాధికారులు, ప్రధానో పాధ్యాయులు, సిఆర్ ఎమ్‌టిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎస్ కునార్ మాట్లడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో తప్పనిసరిగా సన్నబియ్యం, మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థుల యొక్క నమోదు యుడేస్ ప్లస్ నందు తప్పక నమోదు చేయాలని సూచించారు. కొత్తగా నమోదు చేసిన విద్యార్థులకు కూడ తల్లికి వందనం వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్క ఉపాధ్యా యుడుకు టీచర్ హ్యాండ్ బుక్ గురించి తెలియజేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో స్టడిక్లాస్‌లు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధానోపాధ్యాయులకు పలుసూచనలు, సలహాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఉప విద్యాశాఖాధికారి డి.సనత్‌కుమార్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరిశంకర్, అకడమిక్ మానిటర్ ఆఫీసర్ శివశంకర్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అసాధ్యాలను సుసాధ్యం చేయటం సిఎంకే సాధ్యం

### -రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బి.సి సుధాకర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త : అసాధ్యాలను సుస్సాధ్యం చేయటం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆది నుంచి అలవాటు అని రాష్ట్ర రహదారులు భవనాలశాఖ మంత్రి బి.సి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన శ్రీకాళహస్తీశ్వరుని కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, ఆలయ ఇఒ డి.బాపిరెడ్డిలు ఘన స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలుగుదేశం మిత్ర పక్షాలు మేనీ ఫేస్టోను విడుదల చేస్తే 'ఆ హామీలు నెరవేర్చటం సాధ్యం కాదని అధికార పక్షం అయిన వైకాపా ఖండించిందన్నారు. ఏడాదిలో 20శాతం హామీలు అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. రాష్ట్ర చరిత్రలో కనీ విని ఎరుగని 175కు గాను 164 సీట్ల మెజారిటి అందించిన ప్రజల ఆశలు ఆశయాలను నెరవేర్చటానికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. నెలకొక మారు ఢిల్లి వెళ్ళి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నిధులు సాధిస్తూ ప్రగతి బాట పట్టారన్నారు. గత పాలకుల్లా తమపై ఉన్న కేసుల మాఫీకి వెళ్ళలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పర్యటిస్తున్నారని నిధులు సాధించి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయటంతో పాటు రాజధాని రూపకల్పనలో వేగం పెంచారన్నారు. ఏడాదిలో ఉచిత గ్యాస్ పంపిణి, తల్లికి వందనం, ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసాకు సన్నాహాలు చేస్తున్నా రన్నారు. జనంతో మమేకం కావటానికి 'సుపరిపాలనలో ఏడాది, తొలిఅడుగు' కార్యక్రమాలతో ప్రజల వద్దకు ప్రజా ప్రతినిధులను పంపుతున్నారని మంత్రి వివరించారు.

**జవాబుదారి గల నాయకుడు సుధీర్‌రెడ్డి:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న పథకా లతో ప్రజల్ని ఆకట్టుకుంటుంటే స్థానికంగా పట్టుదల జవాబుదారి తనం కల్గిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడుపుతున్నా రనటానికి నిదర్శనం శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధి అని మంత్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. గతంలో తాను శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకు న్నానని నేడు చూసానని ఎంత అభివృద్ధి అని ప్రసంశించారు. పూజా విధానం ఆలయంలో లైటింగ్ విధానం, నిత్యాన్న ప్రసాదంలు ఒకటేమిటి ఎన్నో మార్పులు చోటు చేసుకున్నా యన్నారు. గత పాలనలో అభివృద్ధి ముసుగులో అంతా స్వాహా చేస్తే సుధీర్‌రెడ్డి అన్ని తానే అయి ప్రగతి పథన నడుపుతున్నట్లు తనకు ఇక్కడి దేశం వర్గాలు తెలిపాయన్నారు. ఇలాంటి నాయకుని సేవలు ఎంతో అవసరం అని మంత్రి అభినందించారు.

**రహదారులకు బంగారు భవిష్యత్తు:**

రాష్ట్రంలో రహదారులు, భవనాల శాఖకు సంబంధించిన రోడ్లకు రానున్న రోజుల్లో మహర్దశ వస్తుందని మంత్రి జనార్ధన్‌రెడ్డి వివరించారు. ఆయా నియోజకవర్గాల నుంచి నాయకులు ప్రతిపాదించిన ప్రతి రోడ్డుకు నిధులు మంజూరు చేస్తున్నామని మంత్రి వివరించారు. రోడ్ల విషయంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పట్టుదలగా ఉన్నారన్నారు. రహదారులు మన సంస్కృతికి, ప్రగతికి నిదర్శనమని భావించి నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు.

## వర్షం వస్తే నల్లమానికాల్వ రోడ్లు నీళ్ల మయం

### -అడుగు తీసి అడుగు వేయాలంటే నీటిలోనే



తిరుపతిరూరల్, జూలై 22 ప్రభాతవార్త: తనపల్లిలో వర్షం వస్తే రోడ్లు అన్ని జలమయం అవడం సర్వ సాధారణం. వర్షం వచ్చినా రాకపోయిన రోడ్లలో నీరు నిల్వడం తనపల్లి పంచాయతీ నల్లమాని కాల్వలో అనవాయితీగా కొనసాగుతుంది. వర్షపు నీరు కావచ్చు...ఇళ్లు, ఇంటి ఆవరణం శుభ్రపరిచే నీరు కావచ్చు, ఇంటిపై ట్యాంకు నిండి వచ్చే నీరు కావచ్చు, అదమరిచి కుళాయి నీరు కావచ్చు...ఇలా రోడ్లపైకి వచ్చిన నీరు అలానే రోడ్లపై స్టోరేజ్ కావడంలో ఆయా రోడ్లలో నివాసం ఉండే స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటి నుండి బయటకు అడుగు పెట్టాలంటే నీటిలోనే పెట్టాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. గత పంచాయతీ కార్యదర్శి ఉదయమే పంచాయతీలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే వారని, ప్రస్తుత సచివాలయ కార్యదర్శి ప్రభుత్వం నిర్ధేశించిన సమయంలోనే పంచాయతీలో విధులు నిర్వహిస్తూ, ప్రజా సమస్యలు పట్ల స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**బంగారు కుటుంబాలు గుర్తించడంలో అంతా అయోమం:**

తిరుపతిరూరల్ మండలం తనపల్లి గ్రామ పంచాయతీలో బంగారు కుటుంబాలు గుర్తించడంలో పూర్తిగా విఫలమైనారని పలువురు టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తంగా చేసారు. తనపల్లి గ్రామ పంచాయతీలో 73 కుటుంబాలను బంగారు కుటుంబాలు గుర్తించారని, అందులో దాదాపు అందరూ బంగారు అనర్హులేనని స్థానికులు తెలిపారు. ఇప్పటికైన పంచాయతీలో ఎవరు పేద వారు, ఎవ్వరు బంగారు కుటుంబానికి అర్హులనే విషయాన్ని గుర్తించాల్సి ఉంది.

## ప్రపంచ వ్యాప్తంగా హరిహర వీరమల్లు చిత్రం ఆగమనం



తిరుపతి విద్య, జూలై 22 ప్రభాతవార్త : హరిహర వీరమల్లు చిత్రం ప్రపంచవ్యాప్తంగా 24న రిలీజ్ కానున్న సందర్భంగా.. ఒకరోజు ముందే జనసేన పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో.. సినిమా సక్సెస్ ను మంగళవారం పెద్ద ఎత్తన మ్యూజిక్ కాలేజ్ కూడలి వద్ద నుంచి ప్రతాప్ థియేటర్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించిన తిరుపతి జనసేన నేతలు, వీరమహిళలు, జనసైనికులు, మెగా అభిమానులు. ఈ సందర్భంగా.. రాజారెడ్డి, జనసేన కార్పొరేటర్లు, జనసేన నేతలు మాట్లాడుతూ.. హరిహర వీరమల్లు సినిమా సక్సెస్‌ను తిరుపతిలో ఒకరోజు ముందే అభిమానులతో కలిసి జరుపుకున్నామని, ఈ సినిమా ఘన విజయం సాధించటం తధ్యమని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ సినిమాలలో మొట్టమొదటిసారిగా హరిహర వీరమల్లు సినిమా పాన్ ఇండియా మొత్తం రిలీజ్ కానున్నదన్నారు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద కొత్త రికార్డులను సృష్టిస్తుందని వారు స్పష్టం చేశారు. మెగా అభిమానులందరికీ ఈనెల 23న పెద్ద పండుగ వాతావరణంలా ఉంటుందన్నారు. ఈ బైక్ ర్యాలీలో జనసేన నేతలు, వీరమహిళలు, జనసైనికులు, మెగా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆహార నాణ్యత పరీక్ష పరిశోధనశాల ప్రారంభం



తిరుమల, జూలై 22ప్రభాతవార్తప్రతినిది: తిరుమలలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆహార పరిశోధనశాలను మంగళవారం టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ గతంలో స్వామివారి ప్రసాదాలు, నెయ్యి తదితర వస్తువుల నాణ్యతను పరీక్షించేందుకు ఇతర రాష్ట్రాలకు నమూనాలు పంపాల్సి వచ్చేదన్నారు. 75 లక్షలు రూపాయలు విలువైన ఈ పరికరాలను గుజరాత్ లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు విరాళంగా అందజేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్, సదాశివరావు, నరేష్, సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవోలు భాస్కర్, సోమన్నారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి అధికారులు పాల్గొన్నారు.